## పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపిక



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం | 09 మే, 2025 | పేజీలు : 08

### పుష్కర పనులపై కొనసాగుతున్న

# అలసత్వ నీలినీడలు

**నత్తనడకన కొనసాగుతున్న రూ.25 కోట్ల పుష్కర పనులు**

**సమీక్షలు, సమావేశాలకే పరిమితమైన పుష్కర ఏర్పాట్ల పనులు**





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/ కాళేశ్వరం :** దేవుడు వరమిచ్చినా పూజరి కరుణించని చందంగా మారింది కాళేశ్వరంలో పుష్కరాల పనులు.రాష్ట్ర ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసినా పనుల పురోగతిలో ఫలితం కనిపించడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఈ నెల 15 నుండి 26 వరకు కొనసాగనున్న సరస్వతి పుష్కరాలను ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పుష్కర అభివృద్ధి ఏర్పాట్లపై రూ.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ సంధర్భంగా 25 కోట్ల అభివృద్ధి పనుల నిర్వహణ బాధ్యతలను శాఖల వారీగా కేటాయించి ఆయా శాఖల పర్యవేక్షణలో పనులు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేసారు. 25 కోట్ల నిధుల్లో దేవాదాయ శాఖకు 9.60 కోట్లు, ఇరిగేషన్ శాఖకు 5.32 కోట్లు పంచాయత్ రాజ్ శాఖకు 3 కోట్లు,ఆర్డబ్ల్యూఎస్ కు 3 కోట్లు, విద్యుత్ శాఖకు 1 కోటి పనులను కేటాయించి ఆయా ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో టెండర్ల ప్రక్రియ ద్వారా గుత్తేదారులకు అప్పగించి పనులు ప్రారంభించారు. పుష్కరాలు సమీపిస్తుండటంతో యుద్ధప్రాతిపదికన కొనసాగించాల్సిన పనులు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం గుత్తేదారులు అలసత్వం కారణంగా ఏర్పాట్ల పనులు పడకేసి నిద్రావస్థకు చేరుకున్నాయి. సరస్వతీ పుష్కరాల పనుల ఏర్పాట్లపై సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆధ్వర్యంలో మూడు సార్లు, జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో పలుమార్లు, కాళేశ్వరం దేవస్థానం కార్యాలయంలో దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో అనేక సార్లు ఏర్పాట్ల పనులపై సమీక్షలు, సమావేశాలు నిర్వహించడం తప్ప పనుల పురోగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా కాళేశ్వరం క్షేత్రంలో ఇటీవల పుష్కర పనులను పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు పనుల ఏర్పాట్లపై అధికారుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేయగా బుధవారం క్షేత్రంలో పుష్కర పనులను పరిశీలించిన దేవాదాయ శాఖ కమీషనర్ వెంకట రావు ఏర్పాట్ల పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించటం లేదని ఈ నెల 12 వరకు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయకపోతే చర్యలకు చేపట్టాల్సి ఉంటుందని అధికారులను, గుత్తేదారులను హెచ్చరించడం చర్చానీయాంశంగా మారింది.

మంత్రి శ్రీధర్ బాబు ఇలాకాలో ప్రతిష్టాత్మకంగా మారిన సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, గుత్తేదారులు నత్తనడక ఏర్పాట్ల పనులపై వేగం పెంచి ఇప్పటికైనా నిర్ణీత సమయంలో పూర్తి చేస్తారా..? లేదా..? అనేది వేచి చూడాల్సిందే.

### భూ సమస్యల సత్వర పరిష్కారానికి

# రెవెన్యూ సదస్సులు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**




**ప్రజాపక్షం/పరకాల :** భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. భూ భారతీ రెవెన్యూ సదస్సులో భాగంగా గురువారం నడికూడ మండల కేంద్రంలో, నడి కూడ మండలం చర్లపల్లి గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్ తదితర వాటిని సందర్శించి, రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. సదస్సులతో భేటీ అయ్యి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా భూభారతి విధివిధానాల గురించి, చట్టంలో పొందుపర్చిన అంశాలపై అవగాహన కల్పించారు. రెవెన్యూ అధికారులతో కూడిన బృందాలు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన మీదట నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ సూచించారు. రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సదస్సులలో పరకాల ఆర్డీఓ నారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగీలాల్ , గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్, తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో విమల, మండల వెరిఫికేషన్ అధికారి హారిక, ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఒక నెల లోపల టాయిలెట్స్ నిర్మించాలి

**సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు**




**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి:** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి టాయిలెట్స్ నిర్మించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మిషన్ భగీరథ విద్య వైద్య ఆరోగ్య మహిళా శిశు సంక్షేమ శాఖల అదికారులతో కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. టాయిలెట్స్ లేని పాఠశాలల్లో తప్పని సరిగా నిర్మించాలన్నారు. టాయిలెట్స్ నిర్మాణాలు ఒక నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు 40 మంది అబ్బాయిలకు ఒక టాయిలెట్ 30 అమ్మాయిలకు ఒకటీ టాయిలెట్ లెక్కన విద్యార్థుల సంఖ్య ప్రకారం నిర్మించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో వంట గది ప్రహారీ గోడ నిర్మాణం చేయాలన్నారు. గ్రామాల్లో సిసి రోడ్స్ పూర్తి చేయాలన్నారు. గురుకుల పాఠశాల కళాశాలల్లో వంట గది ప్రహరీ గోడ నిర్మాణం చేయాలన్నారు. గ్రామాల్లో సిసి రోడ్స్ పూర్తి చేయాలన్నారు. పాఠశాల కళాశాలలో వాటర్ ట్యాంక్ ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గురుకుల విద్యాసంస్థలకు అంగన్వాడీ కేంద్రాలకు మిషన్ భగీరథ నీరు తప్పని సరిగా సరఫరాచేయాలన్నారు. త్రాగు నీటి సమస్య లేకుండా చూడాలని మౌళిక వసతులు సదుపాయాలు కల్పించాలన్నారు. వివిధ పెండింగ్ పనులు పూర్తి చేయాడానికి అదికారులు ,పాఠశాలలకు వచ్చినప్పుడు స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలలో గ్రామ పంచాయతీలు, భవనాలు నిర్మించాలన్నారు. గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల భవనాలు నిర్మించాలన్నారు. అంగన్వాడి అధికారులు అంగన్వాడి కేంద్రాలను సందర్శించి తనిఖీ చేయాలన్నారు. సిడిపిఓలు సూపర్‌వైజర్లతోసమీక్ష నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి పంచాయతీరాజ్ అదికారి సాయిబాబా పిడి డిఆర్డీ జ్యోతి వైద్య అధికారిని గాయత్రి దేవి ఏఈఓడి ఈలు సంబందిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా భద్రకాళీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు గురువారంతో తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం వసంతోత్సవం నిర్వహించారు ఉదయం చతురస్తసేవ, సాయంకాలం విమానక సేవ(సర్వభూపాల వాహన సేవ)పై అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారికి బలి ఉత్సవం జరిపిన పిమ్మట, చతురస్తసేవ వైభవంగా నిర్వహించారు. సాయంకాలం సర్వభూపాల వాహన సేవ కూడా అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ఉభయదాతలుగా తెలంగాణ రాష్ట్ర కుమ్మరి కుల సంఘం వారు వ్యవహరించారు. హైదరాబాద్ వాస్తవ్యులు ఆమంచి నాగపరిమళ శ్రీనివాస రావు దంపతుల ఆధ్వర్యంలో అనేక మంది కుమ్మరి కుల పెద్దలు అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు, పూజాద్రవ్యాలు శిరస్సు మీద ధరించి మేళ తాళాలతో వేదస్వస్తితో గుడిలోకి ప్రవేశించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి షోడశోపచారపూజ జరిపి అమ్మవారి అనుజ్ఞతో స్నపనమండపంలోకి ప్రవేశించి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. తదుపరి



నారీమణులచే అమ్మవారికి కుంకుమార్చన జరుపబడిన తర్వాత హోమం జరిపారు. ఆ తర్వాత అమ్మవారికి చతురస్తసేవ నిర్వహించారు. సాయంకాలం విమానక సేవ కూడా వైభవంగా నిర్వహించారు. 1500 మందికి మహాఅన్నదానం నిర్వహించారు. కుమ్మరి సంఘం ప్రముఖులు ఆమంచి రాజ్రప్రదీప్ అనసూయ ఆమంచి అనిల్ కార్తీక్ రాజేశ్వరి, ఆమంచి ధ ర్మరాజు వందన, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవునూరి రాం మూర్తి ప్రజాపతి, జిల్లా అధ్యక్షులు రుద్రారపు కుమారస్వామి ప్రజాపతి, నాంపల్లి ప్రభాకర్, నాంపల్లి శ్రీనివాస్, ఇద్దగిరి రమేష మూర్తి, ఆవునూరి కుమారస్వా మి, పాలడుగుల నాగ రాజు, డాక్టర్ రాజ్‌గోపాల్, స ముద్రాల వెంకన్న, బాయికాడి కుమారస్వామి, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండికుమ్మరి కుల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల మనో ఉల్లాసానికి వేసవి శిక్షణా శిబిరాలు




**ప్రజాపక్షం/తరిగొప్పుల:** ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరిగొప్పుల నందు విద్యార్థుల మనో ఉల్లాసానికి, సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును పాఠశాల హెచ్ఎం బానోతు రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో నెల్లుట్ల జానకి మాట్లాడుతూ ఈ వేసవిలో కొత్త తరహాలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి అద్భుతమైన ప్రతిభ పాటవాలను నేర్పడం అభినందనీయమన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాలెపు విజయ, ఆవుల అమర్నాథ్, దొంతుల శ్రీనివాస్, శ్రీరాములు, వీరస్వామి, విక్రాంత్, రాజేష్, సీఆర్పీ మహాలక్ష్మి, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** బల్ల శకుంతల జ్ఞాపకార్థం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు బాల నరసింహులు, బల్ల మోహన్, పావని పట్టణంలోని రాజేరాజేశ్వరి వృద్ధాశ్రమంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ బీమ్‌రాజ్, ఫౌండేషన్ ప్రతినిధులు నరసింహులు,వరుణ్,తదితరులు పాల్గొన్నారు.

## నాంచారమ్మ జాతరకు సౌకర్యాలు కల్పించాలి

### తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** మండలంలోని రామంజపురం గ్రామంలో గత ఎనిమిది సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా నాంచారమ్మ జాతర జరుపుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర టిఎస్‌కి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గత 812 సంవత్సరాల క్రితం ఎరుకల నాంచారమ్మ పంచకూటాలయం రామాంజపురం గ్రామంలో పంటల పంటల పొలాల మధ్య ఉందని అన్నారు. నాంచారమ్మ జాతర గత ఎనమిది సంవత్సరాల నుండి నాంచారమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ లోకిని రాజు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.



గత సంవత్సరం జాతరకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హాజరై పూజలు నిర్వహించారన్నారు. అక్కడికి వచ్చే భక్తులకు నీటి సౌకర్యం, వైద్యం, భోజన వసతి, రోడ్డు సౌకర్యం చేయించాలని తెలిపారు. వారి వెంట తెలంగాణ ఆదివాసీ ములుగు జిల్లా ఉపాధ్యక్షులు సల్ల బాబు తదితరులు ఉన్నారు.

## ప్రొఫెసర్ సుజాతను శిక్షించాలి

**ప్రజాపక్షం/నెక్కొండ:** శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న సుజాత, భారతదేశం పేరు పెట్టిన సింధూరం ఆపరేషన్‌ను ఎగతాళి చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి దేశ భద్రతకు, దేశ సైనికులను, భారతదేశాన్ని అవమానించారని, ఆమెకు టూరిస్టులను అతి దారుణంగా టెర్రరిస్టులు చంపినప్పుడు కనిపించలేదా రక్తపు టెరులు, అని వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పలు రాజకీయ పక్షాలు, అభ్యుదయ భావాలు గల దేశభక్తులు, విలేకరుల సమావేశంలో అన్నారు. సింధూర్ ఆపరేషన్ ను ప్రపంచం మొత్తం కొని ఆడుతుంటే సుజాతకు కనిపించలేదా కళ్ళు ఉన్న కబోదిలా విచక్షణారహితంగా బాధ్యతలో ఉండి బాధ్యత మరిచి మాట్లాడటం ఆమెకు తగదని భారత ప్రభుత్వం వెంటనే ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని,శిక్ష విధించాలని లేనియెడల ప్రతి ఒక్కరూ ఒక ఫ్యాషన్ గా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే మాదిరిగా సోషల్ మీడియాలో ట్విట్టర్లో ప్రకటనలు చేస్తారని, టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కొమ్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, ప్రముఖ న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ మారం రాము, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నాయిని అనూష అశోక్, అంబాల రామ్ గోపాల్, దామెరచర్ల రామారావు, శ్రీరంగం శ్రీనివాస్, శ్రీరంగం సంపత్, టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాకయ్య భారతప్రభుత్వానికి సూచించారు.

## ఆసుపత్రికి ఆపరేషన్ సామాగ్రి అందజేత



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** సిఎస్ఆర్‌లో భాగంగా ఈసిఐఎల్ హైదరాబాద్ సంస్థ ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.20లక్షల విలువ గల ఎముకల విభాగానికి చెందిన ఆపరేషన్ సిఆర్మ్ మెషిన్, ఓట్ లైట్, ఫ్రాక్చర్, టేఫాక్చర్ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈసిఐఎల్ హైదరాబాద్ సంస్థ చేసిన గొప్ప పనిని అభినందించారు. భవిష్యత్తులో ఆసుపత్రికి ఉపయోగపడే ఇటువంటి మంచి పనులు చేయడానికి ముందుకు రావాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జగదీష్, ఈసిఐఎల్ ప్రతినిధులు సి మురళీధర్, ఈడి సుధన్షు కుమార్, ఎడ్(ఫెన్సాన్స్), రంజన్ శ్రీవాస్తవ, ఏజిఎం(ఫైనాన్స్) డాక్టర్ పివేణుబాబు, సిఎంఓ,ఎస్‌డిజిఎం ఎ రామకృష్ణ, డి షిరిషా, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఎం కుమార్, యూనియన్ ప్రతినిధి ఎ సాంబమూర్తి, కార్పొరేట్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిపార్ట్‌మెంట్, డాక్టర్లు వినయ్, శాంతి, బిక్షపతి, బింగి, ప్రవీణ్ రెడ్డి, నరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** యువత మాదక ద్రవ్యాల మాయలో పడకుండా బంగారు భవిష్యత్‌కి బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నషా ముక్తి అభియాన్ కింద అవగాహన కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వాడకం, నిర్మూలన మీద గ్రామస్థాయిలో పనిచేసే ఆశ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, అటెండర్స్, మహిళా ఉద్యోగినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలందరు గ్రామాలలో పురుషులు, యువతీ, యువకులు మత్తుమందుకు, ఆల్కహాల్‌కి, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్య రహిత జిల్లాగా ఏర్పడేందుకు అందరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఫ్లోరెన్స్, డీఆర్డీవో వసంత, డీపీవో స్వరూప, తిరుమల బ్యాంక్ చైర్మన్, కంచి వెల్ఫేర్ సొసైటీ పరమేశ్వరి శర్మ, హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వేసవి క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే యంగ్ ఇండియా సమ్మర్ వేసవి క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆవుల రాములు అన్నారు. గురువారం మండలంలోని పాలకుర్తి, బమ్మెర, గూడూరు, ఈరవెన్ను, తొర్రూరు, చెన్నూరు. వావిలాల, మల్లంపల్లి ఉన్నతపాఠశాలల్లో క్యాంపులు ప్రారంభించారు. వావిలాల ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రాములు, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంటా రవీందర్ సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ బృందం, తదితరులున్నారు.

## ప్రారంభమైన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్



**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో గ్రేస్ కేజియా రాణి మాట్లాడుతూ ఈ క్యాంపు పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, వేదిక్ మ్యాథ్స్, పెయింటింగ్, ఆటలు, పాటలు, తెలంగాణ కళారూపాలు లాంటి పలు అంశాలు నేర్చుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. కావున ఆవాసంలోని పిల్లలు, తల్లిదండ్రులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు గడ్డం చంద్రమౌళి, సీఆర్పీలు జవ్వాజి జ్ఞానానం దం, జె బాలాజి, కె అనిల్, ఇన్‌స్ట్రక్టర్స్ నాగరాజు, రవి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

## వాసవీమాతకు పంచామృతాలతో పూజలు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** వాసవిమాతకు ఆర్యవైశ్య మహిళలు పంచామృతాలతో విశేష పూజలను చేశారు. గురువారం వాసవి అమ్మవారికి రెండో రోజు అమ్మవారిని స్తుతిస్తూ లోక కళ్యాణం కోసం పంచామృతాలతో పీఠం అధిపతి అనిల్ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పూజాధికాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పౌరోహితులు అనిల్ ఈ పూజా కార్యక్రమ విశిష్టతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 12న ఎంసిపిఐయు వ్యవస్థాపకులు ఓంకార్ శతజయంతి

## ఎంసిపిఐయుచే వార్షికోత్సవ వాల్ పోస్టర్లను విడుదల



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఈ నెల12న వరంగల్ జిల్లా మచ్చాపూర్ లోని కామ్రేడ్ ఓంకార్ 125 అడుగుల భారీ స్మారక స్తూపం పునః ప్రారంభిస్తూ కామ్రేడ్ ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ప్రారంభ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంసిపిఐయు హనుమకొండ జిల్లాకార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి తెలిపారు. గురువారం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, ఎంసిపిఐయు వ్యవస్థాపకులు ఓంకార్ శతజయంతి వాల్ పోస్టర్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట విడుదల చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ ప్రజల మన్ననలు పొంది గెలిచారని, ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. అలుపెరుగని విరోచిత పోరాటాలు చేశారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటన్ని ముందు వరుసలో ఉండి నడిపించిన మహోన్నతమైన కమ్యూనిస్టు అని, నిస్వార్థం ఎరుగక వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన పేదల పెన్నిదని, తన నియోజకవర్గ ప్రజల సమస్యలే కాకుండా యావత్తు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సమస్యలను అసెంబ్లీలో ధారాళముగా వినిపించిన గొప్ప వ్యక్తి అన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి జరపాలని, ఆదివాసి గిరిజనులకు స్వయంపాలన కల్పించాలని, వారి హక్కుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి అమలు చేయాలని, రాష్ట్రంలోని అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ పేరు గాంచారని, రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో బూటకపు ఎన్కౌంటర్లను వ్యతిరేకిస్తూ నక్సలిజం ప్రభుత్వ వైఖరి అనే అంశంపై శాసనసభలో రెండున్నర గంటలు ఏకధాటిగా ప్రసంగించారని, ఎన్నోసార్లు రాజకీయ ప్రత్యర్థులు గుండాలు ఆయనను హత్య గావించడానికి అనేక ప్రయత్నాలు చేసినా అప్పటికీ మరణ అంచుల దాకా వెళ్ళినా గాని ప్రజల ఆశీర్వాదాలతో మరణాన్ని సైతం గెలిచి మృత్యుంజయుడుగా పేరు గాంచారని అన్నారు. 1984లో ఎం సి పి ఐని స్థాపించి అంచలంచలుగా ఎదుగుతూ దేశవ్యాప్తంగా పార్టీని వ్యాప్తింపచేసి 2006లో ఏం సిపిఐయుగా ఏర్పరిచారని, మార్క్సిజంతో పాటు, అంబేద్కర్ ఆలోచనా విధానం అవసరమని 1986 లోనే వర్గ వ్యవస్థలో భాగమే కుల వ్యవస్థ అని ఒక పుస్తకాన్ని రాసి ప్రజలకు అందించినాడని, భారతీయ సామాజిక తత్వాన్ని చాటి చెప్పారని అన్నారు. 1999 లో నాలుగు రాజకీయ పార్టీలను, 14 కుల సంఘాలను ఏకం చేసి మహాజన ఫ్రంట్ ఏర్పాటు చేశారని, వామపక్ష పార్టీలు ఐక్యం కావాలని తపించేవారని, ఆయన నివసించే ఓల్డ్ఎమ్మెల్యే క్వార్టర్స్ వేదిక చేసుకుని 9 కమ్యూనిస్టు పార్టీలతో నిర్మాణానికి, 2000 సంవత్సరం నాటి విద్యుత్ ఉద్యమ నిర్మాణానికి నాంది పలికారని, సాధించారని, చెబుతూ పోతే ఆయన గురించి చెబుతూ పోతే అయినా చరిత్ర అనిర్వచనియ మైనదని, అజరామరమైనదని, తరాలైన మర్చి పోనిదని, అందరికీ ఆదర్శనీయమైనదని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కర్ర రాజిరెడ్డి, నీల రవీందర్, మాస సావిత్రి, చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు కూతురు ఇంద్రారెడ్డి, మట్టెడ మొగిలి, గోపాల్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో దేశభక్తిని చాటుకుంటున్న ప్రజలు

**ప్రజాపక్షం/నెక్కొండ:**గత కొద్ది రోజుల క్రితం పాకిస్తాన్ భారత్ సరిహద్దుల్లోని భారత భూభాగం పహాల్గాం లో టెర్రరిస్టులు (ఉగ్రవాదులు) అమాయకులైన భారత టూరిస్టులను విచక్షణారహితంగా చంపడంతో ఒక్కసారిగా యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. శత్రు దేశమైన పాకిస్తాన్ టెర్రరిస్టులను, ఉగ్రవాదులను పోషిస్తున్నదనే సరైన సమాచారంతో భారతదేశం దాడులు జరుగుతున్న క్రమంలో దేశం నలుమూలలలో సెలవుల్లో ఉండి విధుల్లోకి వెళుతున్న జవాన్ల కు రైల్వే స్టేషన్లో, బస్టాండ్లు, ఎక్కడ కనిపించిన వారికి సకల మర్యాదలు చేస్తూ, సీటు లేని వారికి కూర్చోవడానికి అవకాశం కల్పించాలని, సోషల్ మీడియాలో ఒకరికి, ఒకరు, లక్షలాదిమంది గ్రూపుల ద్వారా తమ దేశభక్తిని చాటుకుంటున్నా వైనం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం లోని 39 గ్రామ పంచాయతీ లోని అన్ని రకాల సోషల్ మీడియా గ్రూపుల్లో ఈ సమాచారం చెక్కర్లు కొడుతున్నది.

దీంతో ప్రజలకు దేశంపై ఎంత ప్రేమ ఉందో స్పష్టంగా కనిపిస్తున్నది.

# భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడికి సన్మానం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా లోని గొల్లపల్లి మండల భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన చెవులమద్ది శేఖర్ నియమితులైన సందర్భంగా గురువారం కరీంనగర్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జాతీయ కౌన్సిల్ నెంబర్ పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి శాలువాతో సత్కరించిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .గతంలో ఎబివిపి నాయకునిగా వి ద్యార్థి దశ నుంచే విద్యార్థుల సమస్యల పట్ల పోరాటం చేశారని పది సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ దళిత మోర్చా మండల అధ్యక్షులుగా చేశారన్నారు. త్వరలో జరగబో వు స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని ఆయన సూచించారు. శేఖర్ మాట్లాడుతూ.తన నియామకం పార్టీ కోసం నిబద్ధతతో అంకిత భావం తో పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఇచ్చిన గౌరవం అన్నారు ఒక దళిత సామాజిక వర్గానికి ఇప్పటి వరకు ఏ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వలేదని ఒక్క బీజేపీ పార్టీ సామాజిక న్యాయం చేసిందన్నారు మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేస్తానన్నారు.నా నియామకానికి కృషి చేసిన పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ ధర్మపరి నియోజకవర్గ ఇన్ ఛార్జి కన్నం అంజన్న,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొమ్ము రాంబాబు, మాజీ మండల అధ్యక్షులు కట్ట మహేష్, మండల బీజేవైఎం అధ్యక్షులు లక్కకుల వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# వారసత్వ భూమిని పట్టాచేయాలని దంపతుల వేడుకోలు



**ప్రజాపక్షం / వేలేరు :** తండ్రి వారసత్వ భూమిలోని వాటాను అన్నతోపాటుగా తమకు కూడా పట్టాచేయాలని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన దానవేణి కరుణ సారయ్య దంపతులు తహశీల్దార్‌కు మొరపెట్టకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన చేందుతున్నారు.గురువారం వేలేరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేషంలో మాట్లాడడుతూ ఎర్రబెల్లి గ్రామశివారులో ఓసర్వే నెంబరులో 6.11ఎకరాల భూమి మాతండ్రిగారి పేరుమీద ఉండగా మాఅన్నగారు 4ఎకరాల భూమిని తన పేరుమీద పట్టాచేయించుకోగా మిగతా 2.11ఎకరాల భూమిని తన పేరుమీదనే పట్టా చేయించుకోవడంకోసం వేలేరు తహశీల్దార్ కార్యకార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారనే సమాచారం మేరకు తహశీల్దారుకు దరఖాస్తు చేయగా ఇది స్లాట్ బుక్ చేసుకోవడం జరిగింది కనుక మేము ఏమీచేయలేము మీరు ఏదైనా ఉంటే లీగల్ ఆర్‌డిఒ,లేదా కలెక్టర్ ద్వారా చూసుకోండి భూభారతి చట్టం మార్పుల ద్వారా 30 రోజులలో ఆటోమెటిక్‌గా రిజిస్టర్ ఆవుతదని తెలుపడం జరుగుతోంది ఉన్నత అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

**తహసీల్దార్ వివరాల ప్రకారం ...**

వేలేరు మండల తహశీల్దార్ హెచ్ కోమి వివరాల ప్రకారం భూభారతి నూతన చట్టం ద్వారా వారసత్వ భూమిని మేము తహశీల్దార్‌గా రిజిస్ట్రేషన్ చేయకున్నా ఆటోమెటిక్‌గా రిజిస్టర్ అవుతది కనుక మీరు ఆర్‌డిఒ లేదా కలెక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# కాకతీయ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

## డిఎస్‌ఎ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ

**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెం గ్రామంలోని కాకతీయ విద్యాలయం హైస్కూల్ లో ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా సమ్మర్ క్లాసెస్ నిర్వహిస్తున్నారని డెమొక్రాటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ తెలిపారు. ఐఐటి క్లాసులు నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వేసవి కాలం సెలవులు ఇచ్చిన కానీ అధికారుల కనుసన్నల్లోనే సమ్మర్ స్పెషల్ క్లాసెస్ నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ పేద, మధ్య తరగతి ప్రజల నుండి రూ. 1500 నుండి 2000 వేల వరకు తీసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. అయినప్పటికి మండల విద్యాశాఖ అధికారులు చోద్యం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాకతీయ విద్యాలయం హైస్కూల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై మండల విద్యాధికారి శ్రీధర్ ను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిన విషయం నిజమేనని, అందుకోసం గురువారం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. సమ్మర్ క్లాసులు నిర్వహించకూడదని పాఠశాల యజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కమలాపూర్:**కమలాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ 58వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుండపు చరణ్ పటేల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తవుటం ఝాన్సీ రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, పోడేటి బిక్షపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లం రాజిరెడ్డి, చెరుపల్లి రామచంద్రం, కెత్తె రవి, పెరుమాండ్ల పరుశురాములు, వాసాల శ్రీనివాస్, ఇల్లందకుంట దేవస్థానం డైరెక్టర్ రెక్కల నారాయణ రెడ్డి, గూడెపు మొగిలయ్య, మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, ఆకినపల్లి బిక్షపతి, నెగ్గుల లింగయ్య, కిన్నెర కృష్ణమూర్తి, శ్రీకాంత్, పుల్ల శోభన్ బాబు, పాక శ్రీనివాస్, మొగిలిచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జెఎస్ఆర్



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కేశవాపూర్ గ్రామంలో పోలు సూరమ్మ, రాజమొగిలి కుమార్తె నీరజ, నాగరాజు ల వివాహానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. అనంతరం ఆ గ్రామ బిజెపి నాయకులతో మండల సీనియర్ నాయకులతో ఆయన మాట్లాడారు.గ్రామాలలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎర్రగోల్ల శ్రీనివాస్ యాదవ్,మండల ఉపాధ్యక్షులు పోలు కోటేశ్వర్,బీజేపీ నాయకులు నరేష్,మాజీ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రవి,రజినీకాంత్, పరమేశ్వర్,శరత్,శ్రీకాంత్,శివ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల మహాధర్నాను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/చొప్పదండి:**మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం చొప్పదండిలోని మత్స్యకారుల సంఘ భవనంలో స్థానిక సంఘ నాయకులతో కలిసి ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులమంతా వృత్తి సమస్యలపై ఐక్యంగా పోరాటం చేస్తూ సాదించుకోవాలన్నారు. హైదరాబాదులో జరిగే ధర్నాకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు నూనె శేఖర్, కార్యదర్శి పిట్టల సంపత్, పిట్టల నరసయ్య, పిట్టల ఎల్లయ్య, ఘనవేని రాము, పిట్టల లచ్చయ్య, పిట్టల రాము, కూన సతీష్, పిట్టల నరేష్, పిట్టల రాము, నరసయ్య తదితరులున్నారు.

# ప్రొఫెసర్ సుజాత తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి



**ప్రజాపక్షం/ నర్సంపేట:** ఆపరేషన్ సిందూర్ పై సోషల్ మీడియాలో ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత చేసిన పోస్ట్ దుర్మార్గం అని, సుజాత తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమాదేవి విమర్శించారు. నర్సంపేట పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ పై యావత్ ప్రపంచమంతా భారత్ కు మద్దతు ఇస్తుంటే సుజాతలాంటి కొంతమంది అర్బన్ నక్సల్స్ దేశ సమగ్రతకు భంగం కలిగించేలా మాట్లాడుతున్నారని, వీరి మాటలుదేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. 26 మంది మహిళల సింధూరాన్ని తుడిచేసిన నాడు ఇలాంటి అర్బన్ నక్సల్స్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్ర ప్రభుత్వం కూడా సైనిక చర్యలకు సంఘీభావం తెలిపిందని, కాని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలిగా ఉంటూ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తారా అన్నారు. సిఎం నియమించిన వ్యక్తే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మౌనమేలా అని, సీఎం వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుజాతపై చర్యలు తీసుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని, ఒక మహిళగా ఉండి మహిళలు చేత నిర్వహించబడిన ఆపరేషన్ సిందూర్ ను ఎగతాళి చేయడం దుర్మార్గమన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్ సింగ్ (చిన్న), కూనమల్ల పృథ్వీరాజ్, జిల్లా కౌన్సిల్ మెంబర్స్ పొదిల్లా రామచందర్, గంగిడి మహేందర్ రెడ్డి, నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శులు కందికొండ శ్రీనివాస్, సూత్రం సరిత, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకీస విఘ్నేష్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు విజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తికి జైలు శిక్షతోపాటు వేయి రూపాయలు జరిమానా



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ పోలీసులు ఈనెల 6న వాహన తనిఖీలు చేస్తుండగా మద్యం మత్తులో వాహనం నడుపుతున్న పి.రంజిత్ అనే వ్యక్తి ని అదుపులోకి తీసుకొని పరిశీలించగా మద్యం మోతాదుకు మించి సేవించాడు. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి నర్సంపేట కోర్టులో హాజరు పరచగా గురువారం స్పెషల్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి వెయ్యి రూపాయలు జరిమానాలతో పాటు మూడు రోజుల సాధన జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ వాహన చోదకులు ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనం నడపకూడదని అలా నడిపిన వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

## పుట్టినరోజును పురస్కరించుకుని టీషర్ట్స్ పంపిణీ




**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన నర్సంపేట్ డివిజన్ భారత రాష్ట్ర సమితి నాయకుడు ప్రముఖ న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్ పుట్టిన రోజును పురస్కరించుకొని నెక్కొండ మండలంలోని ఫ్రండ్స్ యూత్ క్రికెట్ టీం సభ్యులకు టీ షర్ట్స్ లు పంపిణీ చేసిన న్యాయవాది రమేష్ యాదవ్, ఫ్రండ్స్ యూత్ సభ్యులు రమేష్ యాదవ్ కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ, యువత సన్మార్గంలో నడవాలని దురాలవాట్లకు దూరంగా ఉండి, క్రికెట్ తో పాటు విద్యారంగంలో ఎంతో ఎత్తుకెదిగి తల్లిదండ్రులను పుట్టిన ఊరు కు సేవలు అందించాలని పిలుపునిచ్చారు.




## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/ వరంగల్ :** యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ డమల జాన్ బర్నబాస్ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో బస్తి బడి, న్యూ శ్యాంపేటలో ఉన్న వారికి 100 మందికి చికెన్ తో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువాల పృథ్వి, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాం ప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), యాద రవి కుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసంలకు కొర్రీలు పెట్టకండి



**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లలో ఆరు గజాల పైన స్థలం ఉంటే అనర్హులుగా ప్రకటించీ రకరకాల కొర్రీలు పెట్టి నిజమైన పేదలకు ఇల్లు మంజూరు చేయలేదని ఇందిరమ్మ కమిటీల జోక్యం తో నిజమైన వారికి అన్యాయం జరిగిందని, భారత రాష్ట్ర సమితి నేతలు తాసిల్దార్ వేముల రాజ కుమార్ కు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య మాట్లాడుతూ, యువతకు యువ వికాసం రుణాలు ఇస్తామని, దరఖాస్తు చేసుకోమని తెలపడంతో లక్షలాదిమంది మీ సేవ సెంటర్లలో రోజుకు వేలమంది ఎంతో ఖర్చు పెట్టుకుని దరఖాస్తు చేసుకున్నారని, కానీ సిబిల్ స్కోర్ అనే సాకుతో యువ వికాసం రుణాలు ఇవ్వకుండా ఏగ గొట్టి ఆలోచనలో ప్రభుత్వం ఉందని, ఆయన ఆరోపించారు. గతంలో కెసిఆర్ ఎలాంటి షరతులు లేకుండా అన్ని వర్గాలకు రుణాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలు మానుకొని భూమిలేని నిరుపేదలకు ఇళ్లస్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగులుగా ఉన్న యువతకు షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం రుణాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. మాతంగి రాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు బొడ్డుపల్లి రాజు, ఇదునూరి శ్రీనివాస్, రేగుల అశోక్, గంద్రకోటి నరేష్, బోనాల హరీష్, లెనిన్, యాకయ్య, పాల్గొన్నారు.

## నిరక్షరాస్య మహిళలకు అక్షరాభ్యాసంపై అవగాహన



**ప్రజాపక్షం / వేలేరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన (ఉల్లాస్)నిరక్షరాశ్యతా మహిళా సంఘాలలోని మహిళలకు అక్షరాశ్యతా కార్యక్రమం ద్వారా చదువు నేర్పించే పతకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఎంఇఒ మొగిళిచెర్ల చంద్రమౌళి అన్నారు .గురువారం వేలేరు మండలకేంద్రంలోని ప్రజాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సంఘాలలోని నిరక్షరాశ్య మహిళలకు అక్షరాభ్యాసం(ఉల్లాస్)అనే కార్యక్రమాన్ని ప్రవేషపెట్టడం జరుగుతోందని తప్పని సరిగా నిరక్షరాశ్యులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఎఇ ఒ చంద్రమౌళి, ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న,ఎపిఎం జయసుధ,వివిధపాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని అప్పయ్య పల్లి గ్రామానికి చెందిన ఒంటెరు భాస్కర్ కు చెందిన పాడి గేదే బుధవారం రాత్రి విద్యుత్ షాక్ తో మృతి చెందింది. ఉదయం మేత కోసం బయటకు వెళ్లిన పాడి గేదె సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఉదయం భాస్కర్ బయటకు వెళ్లి చూడగా ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తో మృతి చెంది కనిపించింది. సుమారు 70 వేల ఈరోజు చేసే గేదె మృతి చెందడంతో రైతు భాస్కర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

## పిడుగుపాటుతో పాడిగేదె మృతి

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** పిడుగు పడి పాడిగేదె మృతిచెందిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం తెల్లావారు జామున ఉరుములతో గాలివాన భీభత్సం సృష్టించింది. కాగా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన రైతు నూనె తిరుపతి వ్యవసాయ క్షేత్రం వద్ద పాడి గేదె పిడిగుపాటుతో మృతిచెందింది. పాలిచ్చే మేలు రకం ఆవు మృతిచెందడం చూసి రైతు కుటుంబం ఆవేదనకు గురవుతున్నారు. పాడిపంటలపై ఆధార పడి జీవిస్తున్న తమకు ప్రభుత్వం సహకారం అందించాలని కోరుతున్నారు.

## పండుగలు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతాయి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గ్రామీణ ప్రాంతాలలో జరుపుకునే పండుగలు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుతాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మంచుప్పుల గ్రామంలో యాదవుల కురుమ ఆరాధ్యదైవం గంగాదేవి తల్లి జాతర వేడుకలకు ఆమె హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు పరుశరాములు, వెంకన్న, కొమురయ్య, యాకాంతరావు, రమేష్, యాకయ్య, హరీష్, భాస్కర్, రమేష్, యాకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

## తండ్రి మృతదేహానికి చిన్నారుల అంత్యక్రియలు

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** అనారోగ్యంతో మృతిచెందిన తండ్రికి చిన్నారి కూతుళ్లు అంత్యక్రియలు చేయడం చూసి పలువురు చలించిపోయారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన సుంచు సాంబరాజు గత కొంత కాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో షుగర్ వ్యాధితో బాధపడుతున్న అతనికి కాలు తొలగించారు. పేద కుటుంబానికి చెందిన సాంబరాజు గత కొన్ని రోజులుగా వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించడంతో గురువారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా ఇద్దరు చిన్నారి కూతుళ్లు కన్నీటితో తండ్రి అంత్యక్రియలు పూర్తిచేసారు. మృతునికి భార్య సమత, కూతుళ్లు అక్షిత, వర్షిణీ ఉన్నారు.

## కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాతో ప్రశంసా పత్రం అందుకున్న హాసిని

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలకేంద్రానికి చెందిన పత్తిపాక కవితారాణి శ్రీనివాస్ దంపతుల కుమార్తె పత్తిపాక హాసిని కరుణాపురంలోని మాడల్ జ్యోతీరావు పూలె పాఠశాలలో పదవతరగతి పరీక్షలో 575 మార్కులు సాధించినందున బుధవారం జనగామ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విజయోత్సు సర్టిఫికెట్ అందించడమే కాకుండా సైకిల్‌ను కూడా అందించారని తెలిపారు.

# ఫోక్సో ,అత్యాచార కేసుల గురించి అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

## భరోసా నోడల్ అధికారి అదనపు ఎస్‌పి ఎ సంజీవరావు




**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి:**జిల్లా ఎస్పీ శ్రీపరితోష్ ఫంకజ్ ఆదేశాను సారం గురువారం రోజు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం నందు జిల్లాలోని వివిద మండలాలకు చెందిన అంగన్ వాడి టీచర్లకు పోక్స్ అత్యాచార కేసుల బారిన పడటం దాని వలన కలిగే పరిణామాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని భరోసా నోడల్ అధికారి /అదనపు ఎస్పీ ఏ సంజీవరావు అన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వివిద రకాల నేరాలను దృష్టిలో ఉంచు కొని అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోక్సో అత్యాచార కేసు నమోదు మొదలుకొని వారి సమస్యకు పరిష్కారంచూపే దిశగా భాదితురాలి వెన్నంటి ఉంటూ మెడికో లీగల్ సేవలను అందిస్తూ భరోసా, సిబ్బంది వారికి న్యాయం జరిగేవిదంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా స్కూల్స్ కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్లకు ప్రభావితమై ఇన్స్టాగ్రామ్ పిస్చుక్ వాట్స్ వంటి సామాజిక మాద్యమాల అపరిచితులతో పరిచయాలు ఏర్పడి ఫోక్సో అత్యాచారాలకు గురి అయ్యే అవకాశం ఉంటుందని గ్రామాలలో ప్రజలకు అతి దగ్గరగా ఉండే అంగన్ వాడీ టీచర్లు గా పిల్లలకు అవగాహన కల్పంచాల్సిన అవసరం ఎంతగానో ఉండి అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా చైల్డ్ మ్యారెజ్ / బాల్యవివాహాలు, జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబందిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. 18 సంవత్సరాల లోపు బాలిబాలికలపై జరిగే లైగింక దారులన్నీటిని ఫోక్సో కేసులుగా పరిగణించడం జరుగుతుందని పోక్సో కేసులుగా అరికట్టాడానికి గ్రామ గ్రామాణ విలేజ్ కమిటీ మీటింగ్స్ నిర్వహించి అవగాహన కల్పించాలని అంగన్ వాడి టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా లీగల్ సర్వీసేస్ అథారిటీసౌజన్య ,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిడబ్ల్యూ ఓ లలిత కుమారి డీపిపిఓ రత్నం భరోసా ఆర్డినేటర్ దేవలక్ష్మి, భరోసా సిబ్బంది సిడిపిఓలు సుమారు 400 మంది అంగన్ వాడి టీచర్లు తదతరులున్నారు.

# జూన్ 5న వైభవంగా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం..

## శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్ గౌడ్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** దివ్యక్షేత్రంగా మండలంలోని గూడూరు గ్రామంలో శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో గుంటూరు విశ్వంజీ విశ్వయోగి మహారాజ్ ఆశీస్సులతో నూతనంగా నిర్మితమైన శ్రీగురుపీఠంలో జూన్ 3 నుండి దత్తాత్రేయ స్వామి, షిరిడీ సాయినాథుని విగ్రహల ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని శ్రీగురుపీఠం చైర్మన్, శ్రీ భగలాముఖి ట్రస్ట్ సభ్యులు హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ అన్నారు. గురువారం ఆగమశాస్త్ర పండితులు గణపతి శర్మ, వేదపండితులు శాస్త్రల వామన శర్మ, సాయిబాబా ఆరెళ్ల మోహన్ రావు, ట్రస్టు సభ్యులు పెద్దగౌని శ్రీనివాస్ గౌడ్, హనుమంతు గుప్తతో కలిసి శ్రీగురుపీఠం విగ్రహ ప్రతిష్ట ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ జూన్ 3న జలాదివాసం, 4న దాన్యాదివాసం, 5న విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు, మూడు రోజుల పాటు భక్తులందరికి అన్నదానం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ప్రముఖులను ఆహ్వానించడం జరుగుతుందని, ప్రతి గ్రామానికి కూడ శ్రీగురుపీఠం ఆహ్వాన పత్రికలను పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్, రాజేందర్ రెడ్డి (చి) శ్రీ సాయి దర్బార్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత మండలానికి రానున్న గురుకుల పాఠశాల..



**ప్రజాపక్షం/బెజ్జంకి:**మండలానికి మంజూరై అనివార్య కారణము చేత ప్రస్తుతం హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ (బాలికల) వసతి గృహం తిరిగి మండల కేంద్రానికి రానుంది.ఈ మేరకు మానకొండూర్ ఎంఎల్‌ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణ సూచన మేరకు సోషల్ వెల్ఫేర్ పాఠశాల ప్రిన్స్‌పల్ ఎం.విజయ,వైస్ ప్రిన్స్‌పల్ బి.జ్యోతి,ఉపాధ్యాయులు స్వప్నతో కలిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మండల కేంద్రంలోని స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు.వీరి వెంట ఏఎంసి వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,దేవస్థాన చైర్మెన్ జెల్ల ప్రభాకర్,శ్రీనివాస్,ఐలయ్య,మల్లేశం,సంతోష్,రవి,నర్సయ్య,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల అహ్వానం

## జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి:** లైసెన్సు సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుచున్నదని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు మీ సేవ కేంద్రాల ద్వారా 100 రూపాయలు రుసుము చెల్లించి లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి ఈ నెల 17 వతేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చాని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణితం శాస్త్రం) ఒక అంశంగా ఉండి కనీలం ఆరవై శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటిఐ నుండి డ్రాఫ్ట్స్ మన్ సివిల్ ,డిప్లమా, సివిల్ బిటెక్ సివిల్ , ఇతర సమానమైన విద్యా అర్హత కలిగి ఉండలన్నారు. శిక్షణ పీజు ఓసి అభ్యర్థులకు రూ. 10 వేలు బిసి అభ్యర్థులకు రూ. 5వేలు ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రూ. 2.500/ చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జి ల్లా ప్రదాన కేంద్రాలలో మొత్తం 50 పనిదినాలలో తె లంగాణ ఆకాడమీ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మె ంట్ ఆద్వర్యంలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. అభ్యర్థులు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవలనితెలిపారు.మిగితవివరాలకుసెల్ నెం.6302476 752,8498855991,988545355 6 సంప్రదించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/రామాయంపేట:**ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మల్లారెడ్డి ఆసుపత్రి వారి అద్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రపంచ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు హెన్రీ రొనాల్డ్ జన్మదినం పురస్కరించుకొని మండలంలోని ఆర్ వెంకటాపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులు పెద్ద ఎత్తున హాజరై పలు రకాల పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులను కూడా అందించారు. ఈసందర్భంగా జిల్లా చైర్మెన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, కోశాదికారి డిజి.శ్రీనివాసశర్మ, మాజీ కౌన్సిలర్ దేమె యాదగిరిలు మాట్లాడుతూ ఒకప్పుడు జిల్లాలో అక్కడక్కడా శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలు అందించే వారమని ఇప్పుడైతే ప్రతి గ్రామంలో కూడా రెడ్‌క్రాస్ సేవలు అందించడం సంతోషకరం అన్నారు. ఈకార్యక్రమంలో మల్లారెడ్డి ఆసుపత్రి వైద్య బృందంతో పాటు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మద్దెల సత్యనారాయణ, మద్దెల రమేష్, సతీష్‌రావు, తోట శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడిని ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/శివ్వంపేట:** జర్నలిస్టులపై దాడి ని ఖండిస్తున్నామని శివ్వంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బొద్దురవి అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై పోలీసులను అడ్డుపెట్టుకొని ఏపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి నిజాలను ప్రజలలోకి తీసుకెళ్తున్న జర్నలిస్టులపై పోలీసులతో దాడులు చేయించడం సబబు కాదన్నారు. వెంటనే ఇలాంటి కార్యక్రమాలను మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు నటరాజ్‌గౌడ్, ఇసుగారి మల్లేశ్, ముంద్రాతి బాలేశ్, బుర్ర మహేశ్‌గౌడ్, బాసంపల్లి కిషోర్‌గౌడ్, పల్లె వీరేశం, పోల్దాస్ వెంకటస్వామి, కుమ్మరి సురేశ్ తదితరులు ఉన్నారు.

# వరసిద్ధి లింగేశ్వర దేవాలయానికి భారీ విరాళం

**ప్రజాపక్షం/కొహెడ:** సిద్దిపేట జిల్లా కొహెడ మండలం గొట్లమిట్ల గ్రామంలోని శ్రీ వరసిద్ధి లింగేశ్వర దేవాలయ పునర్నిర్మాణానికి కాచాపూర్ గ్రామానికి చెందిన కొహెడ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాచకొండ చక్రధర రావు రూ.5,00,116 రూపాయలు భారీ విరాళాన్ని అందించారు.రాచకొండ సుగుణ దేవి, రంగారావు కుమారుడు అయిన రాచకొండ చక్రధరరావు ఈ విరాళాన్ని గురువారం ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. తన తల్లి రాచకొండ సుగుణాదేవి జ్ఞాపకార్థం శ్రీ వరసిద్ధి లింగేశ్వర దేవాలయ పునర్నిర్మాణం కోసం ఈ భారీ విరాళం అందించినట్లు రాచకొండ చక్రధర రావు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ చక్రధరరావుకు ఆలయ కమిటీలో శాశ్వత సభ్యత్వం అందించా రు.

# సీనియర్ జర్నలిస్టుపై పోలీసులదాడి సరికాదు

## కొడిపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పోలీసుపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/కౌడిపల్లి :**విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు దాడి చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని కౌడిపల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. గురువారం కౌడిపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలోఏపి పోలీసుల తీరుపై డిప్యూటీ తహసీల్దార్ జహీర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌడిపల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూఏపిలో జరుగుతున్న అప్రజాస్వామిక, అనాగరిక పాలనపై సాక్షి దినపత్రికలో నిజాలను నిర్భయంగా రాస్తు ప్రజలకు తెలియజేస్తున్నందుకు అక్కడ ప్రభుత్వం జీర్ణించుకోలేక పోతుందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు దాడులు చేసి కుటుంబ సభ్యుల భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తనిఖీల పేరుతో జర్నలిస్టులను భయపెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. జర్నలిస్టులపై పోలీసుల వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులుపాల్గొన్నారు.

## సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై దాడికి ఖండన



సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని నిరసిస్తు గురువారం పాపన్నపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి బాధ్యులపై తగిన చర్యకు డిమాండ్ చేస్తు తహసీల్దార్ సతీష్ కుమార్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, పత్రిక స్వేచ్ఛకు పోలీసులు సంకెళ్ళు వేయడం తగదన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్లుజె రాష్ట్ర నాయకులు మిన్పూర్ శ్రీనివాస్, పాపన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మోహన్రాజ్,ప్రధాన కార్యదర్శి భాస్కర్, మాజీ అధ్యక్షులు బాల్కిషన్, సత్యనారాయణ,శివచరణ్ సింగ్ పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు తప్పవు

## ఎస్ఐ గన్నమనేని శ్రవణ్ కుమార్



**ప్రజాపక్షం/చిట్యాల:**చలి వాగు నుండి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్సై గన్నమనేని శ్రవణ్ కుమార్ తెలిపారు. గురువారం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అందుకు తండా గ్రామానికి చెందిన కాసాని రవి ట్రాక్టర్ పై కేసు నమోదు చేయడం జరిగిందని, ఇక నుండి ఎవరు కూడా అనుమతి పత్రాలు లేనిది అక్రమంగా ఇసుకను తరలించకూడదని, తరలిస్తే మాత్రం చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# 10వ తేదీన ఉద్యమకారుల ఫోరం రౌండ్ టేబుల్ సమావేశం



**ప్రజాపక్షం/మహాదేవపూర్;**ఈ నెల పదవ తేదీన హన్మకొండలో నిర్వహించే ఉద్యమకారుల ఫోరం దక్షిణ తెలంగాణ రౌండ్ టేండ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ అయూబొద్దీన్ గురువారం ప్రకటనలో పిలుపునిచ్చారు.ఉద్యమకారుల ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మెన్ నందగిరి రజినీ కాంత్ పిలుపు మేరకు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మెన్ తీమ శ్రీనివాస్ రావు,మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గం ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.వరంగల్,ఖమ్మం,నల్గొండ,జిల్లాలలోని ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సంఘాల నాయకులు,వివిధ పార్టీల నాయకుల మద్దతు తెలిపి ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను తీరేవిధంగా కృషి చేయాలని కోరారు.

# కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డిసిఒ



**ప్రజాపక్షం/మల్హర్:**మండల కేంద్రమైన తాడిచెర్లతో పాటు మల్లారం, ఎడ్లపల్లి, కొయ్యూరులోని కొనుగోలు కేంద్రాలను గురువారం డిసిఒ వాల్య నాయక్ పరిశీలించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో వేగం పెంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ ,రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూఆపరేషన్ సిందూర్‌ను స్వాగతించాల్సిందే...!

## ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:**ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తో దీటుగా జవాబు చెప్పి భారత దేశ ఖ్యాతిని మరింత ఇనుమడింప చేసిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని మహిళల నుదుటి సిందూరాన్ని దూరం చేసిన పాక్ ఉగ్రవాదులపై ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న ప్రతి చర్యను స్వాగతించాల్సిందేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు పలకాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా పాక్ ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు దేశ రక్షణ దళాలు చేపడుతున్న మెరుపు దాడులు ప్రశంసనీయమని కొనియాడారు. అదును చూసి పాక్ పై దెబ్బ కొట్టిన ప్రధాని నరేంద్ర మోదీ ఎత్తుగడల ముందు పాక్ సైన్యం, ఉగ్రమూకలు వెనుకడుగు వేయక తప్పలేదని చెప్పారు. అయితే పాకిస్తాన్ ఉగ్రమూకల్ని తుదముట్టించే వరకు సర్జికల్ స్ట్రైక్స్ కొనసాగించాలని అన్నారు. గంటసేపు భారత్ చేపట్టిన క్షిపణి దాడులతో పాక్ సైన్యం, ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పినట్లయిందని పేర్కొన్నారు. 28 మందిని పొట్టన పెట్టుకున్న పాక్ ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలని దేశ ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నట్లు వివరించారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట రెడ్డి

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని బెజ్జంకి,ముత్తన్నపేట,డెజ్జంకి క్రాసింగ్,తోటపల్లి,దాచారం గ్రామాల్లో సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ ఆధ్వర్యంలో గ్రామ శాఖల సమావేశాన్ని నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట రెడ్డి హాజరై మాట్లాడారు.దోపిడికి వ్యతిరేకంగా అన్యాయాని ఎండగట్టడంలో సిపిఐ ఎప్పుడు పేద ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు.అనంతరం నూతన గ్రామ శాఖ కార్యదర్శులను ఎన్నుకున్నారు.బెజ్జంకి గ్రామ కార్యదర్శిగా కల్లూరి బాలమల్లు,సహాయ కార్యదర్శిగా పొట్లపల్లి లక్ష్మ ణ్,గుగ్గిళ్ళ గ్రామ కార్యదర్శిగా తిప్పరవేణి పర్శరాములు,సహాయ కార్యదర్శిగా చిట్టి శ్రీనివాస్,తిమ్మాయిపల్లి కార్యదర్శిగా దానమనేని ప్రదీప్,సహాయ కార్యదర్శిగా తాటికొండ రవిందర్,గూడెం గ్రామ కార్యదర్శి మాంకాళి అనిల్,సహాయ కార్యదర్శిగా హనుమాండ్ల గోపాల్ రెడ్డి,కల్లెపల్లి గ్రామ కార్యదర్శిగా బిక్షపతి ,సహాయ కార్యదర్శిగా దొంతి లక్ష్మ ణ్,దేవక్కపల్లి గ్రామ కార్యదర్శిగా సోరుపాక మల్లయ్య,ముత్తన్నపేట గ్రామ కార్యదర్శగా రామంచ శేఖర్,సహాయ కార్యదర్శిగా కుంట రాజు,బెజ్జంకి క్రాసింగ్ కార్యదర్శిగా కోమటిరెడిడ అంజయ్య,సహాయ కార్యదర్శిగా దర్శనాల మహేందర్, తోటపల్లి గ్రామ కార్యదర్శిగా వెన్న నర్సయ్య, దాచారం గ్రామ కార్యదర్శిగా దీటి మల్లే శం ,సహాయ కార్యదర్శి గారమేష్‌లు ఎన్నికైనట్లు వెంకటరెడ్డి తెలిపా రు.

# సాంకేతిక, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక దృష్టి

## ఉద్యానవన పంటల సాగులో అగ్రగామిగా తెలంగాణ

## శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్:**వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు, స్థిరమైన సాగు విధానంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు శివారులోని యూనివర్సిటీలో గురువారం హైదరాబాద్ కు చెందిన మారుత్ డ్రోన్స్ సంస్థతో ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి, విశ్వవిద్యాలయ అధికారుల సమక్షంలో ఉద్యాన పంటలపై పరిశోధన, అభివృద్ధి మరియు శిక్షణలో సహకారాన్ని పెంపొందించడానికి అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణలోని ఉద్యానవన పంటల ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామిగా ఎదుగుతుండగా, ఈ భాగస్వామ్యం డ్రోన్ ఆధారిత సాంకేతికత యొక్క సామర్థ్యాన్ని ఉపయోగించి ఖచ్చితమైన వ్యవసాయం, పంట పర్యవేక్షణ, తెగులు, వ్యాధుల అంచనా, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు మెరుగుపరచడం లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, ఆరు ప్రధాన ఉద్యానవన పంటలైన మిరప, పసుపు, టమోటా, వంకాయ, ఆయిల్ పామ్, మామిడి పరిశోధన, శిక్షణ కార్యక్రమాలు మరియు సాంకేతిక అభివృద్ధిపై సంయుక్తంగా పని చేస్తాయని తెలిపారు. తెలంగాణ రైతులకు వినూత్న పద్ధతిలో సాంకేతిక సలహాలు అందిస్తూ పరిష్కరించేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ మరియు డ్రోన్ల ఏకీకరణతో దిగుబడి, తెగులు, వ్యాధుల అంచనా వేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, మారుత్ డ్రోన్ కో ఫౌండర్ ప్రేమ్ కుమార్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ చీనా నాయక్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ మరియు డీన్ ఆఫ్ పిజి స్టడీస్ డాక్టర్ సురేష్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ వీణ జోషి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక కృషి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**రైతు సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్ళపల్లి మండలం పర్లపల్లి గ్రామంలో ఐకేపీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని, రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చే సిన కొనుగోలు కేంద్రాలకే ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు బొకే ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# హనుమాన్ దీక్షా పరులకు భిక్ష



**ప్రజాపక్షం/కొహెడ:**కొహెడ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో హనుమాన్ దీక్షపరులకు, ప్రజలకు బిక్ష తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 58వ జన్మదినం సందర్భంగా కొహెడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ భారత పార్లమెంట్ సభ్యులుగా మొదటి సారిగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్రం కోసం తను చేసిన పోరాటం అమోగమన్నారు.వారి పోరాట ఫలితం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఈ ప్రజాపాలన ప్రభుత్వంలో భాగస్వాములు అయి నేడు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు.రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నతమైన పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజ్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్ర రవీందర్, మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గోరిత్యాల లక్ష్మ ణ్, తిరుపతిరెడ్డి, రాజేందర్, వెంకటేశ్వర్లు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# హేమాచల బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీ

**ప్రజాపక్షం/మంగపేట :**తెలంగాణలో యాదగిరి గుట్ట తర్వాత రెండవ యాదగిరి గుట్టగా పిలువబడే ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంబుగా వెలసిన మల్లూరు గుట్ట శ్రీ హేమచల శ్రీ లక్ష్మి నృసింహ స్వామి 2025 బ్రహ్మోత్సవాలు సందర్భంగా దేవాదాయ కమిషనర్ హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు 13 మంది సభ్యులతో ఉత్సవ కమిటీ నియమించబడ్డారు. ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం పదవి బాధ్యతలు స్వీకరించిన వీరు 08052025 నుండి 1705 2025 వరకు ఉత్సవ కమిటీ సభ్యులుగా కొనసాగుతారని ఆలయ ఇఒ శ్రవణం సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

# ధనలక్ష్మి సమైక్య నూతన మండల కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/టేకుమట్ల:**టేకుమట్ల మండల ధనలక్ష్మి సమైక్య పరిధిలోగల 26 గ్రామాల సమైక్య సంఘాలు కలిసి నూతన బైలా ప్రకారం మండల సమైక్య నూతన కమిటీని ఎన్నుకున్నట్లు డిపిఎం సోమయ్య తెలిపారు. నూతన మండల అధ్యక్షురాలుగా గువ్వాడి రజిత, కార్యదర్శిగా బండి శ్రీజ, కోశాధికారిగా అభ్యంగుల రాణిలను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాల రవి వర్మ, శ్రీనివాస్, రాజేందర్, మంజుల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మండల అధ్యక్షుడిగా మరోసారి బివిగౌడ్

**ప్రజాపక్షం/చిట్యాల:**మండల కేంద్రానికి చెందిన బుర్ర వెంకటేష్ గౌడ్ ను బిజెపి పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు గురువారం బుర్ర వెంకటేష్ గౌడ్ ను రెండవసారి భారతీయ జనతా పార్టీ చిట్యాల మండల శాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటెల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సత్యపాల్ రెడ్డి, నాగపురి రాజమౌళి గౌడ్, జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్ రెడ్డి, వెన్నంపల్లి పాపయ్యా, కన్నం యుగదిశ్వర్, దొంగల రాజేందర్, జిల్లా మండల నాయకులకు వెంకటేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/హుస్నాబాద్ : తెలంగాణ రవాణశాఖ మరియు బి సీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభకర్‌గౌడు జన్మదిన వేడుకలను హుస్నాబాద్ పట్టణంతో పాటు డివిజన్ పరిధి లోని అన్ని మండల కేంద్రాల్లో గ్రామాల్లో కేకుకట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభకర్ గౌడు నియోజకవర్గంలోని సుందరగిరి వేంకటేశ్వరా దేవాలయం, పొట్లపెల్లి స్వయం భూ రాజారాజ్వేరాదేవా లయం, హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మదేవాల యంలో,కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి పలు దేవాలయాల్లో అలయ సిబ్బంది, అర్చకుల ఘనస్వాతం పలికారు. అనం తరం మంత్రి కార్యకర్తలతో కలిసి క్యాంపు కార్యలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడులకలను జరుపున్నారు. కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ అసుపత్రిలో పేసెం ట్లకు సండ్లు, బ్రేడ్లు పంపిని చేసి రక్తదానం చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి పొన్నం ప్రభకర్‌గౌడు మాట్లాడుతూ నాకు హుస్నాబాద్ నియోజకవర్గం నుండి నన్ను ఎమ్మెల్యేగా గెలి పించి మంత్రిని చేసిన నియోజకవర్గ ప్రజలను నా గుండేల్లో పెట్టుకుని చూసుకుంటానని నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికి ధన్యావాదులు తెలిపారు .నిన్న అపరే షన్ సిందూర్ తరువాత కూడ పాకిస్తాన్ పశ్చతాప పడకుండ కవ్వింపు చర్యలకు పాల్పడుతుందని భారతప్రభుత్వం వారికి సరైన విధంగా జవాబు చెప్పడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి ప్రత్యేక ధన్యా వాదాలు తెలిపారు. ఈ లాంటి సమయంలో పార్టీలకు అతీ తంగా దేశంలోని ప్రతి ఒక్కరు భారత దేశానికి అండగా నిలు వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అధికా రులు పాల్గోన్నారు.

**మద్దూరు/ధూల్మిట్ట :** తెలంగాణ బిసి మరియు రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభకర్ జన్మదిన వేడుకలలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి మద్దూరు మండల మాజీ జెడ్పీటీసి గిరి కొండల్‌రెడ్డి, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు ఉమ్మడి మద్దూరు, ధూల్మిట్ట మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి పాల్గోన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభకర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్య క్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్, ధూల్మిట్ట మండల గ్రామశాఖ అధ్యక్షులు చెప్యాల అనిల్ గౌడ్, పిఎసిఎస్ డైరె క్టర్ శ్రీనివాస్ మండల, వివిధ గ్రామాల కాగ్రెస్ పార్టీ నాయ కులు తదితరులు పాల్గోన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/మంగపేట:మంగపేట మండలం నర్సింహసాగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకుడు బెల్లి కుమార్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా గురువారం వారి కుటుంబ సభ్యు లను గ్రామ కమిటీ అధ్యక్షులు ఉడుగుల శ్రీని వాస్ యాదవ్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 41వేల రూపాయిల ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్ర మంలో సహకార సంఘం వైస్ చైర్మన్ కాడబో యిన నరేందర్, మండల యూత్ నాయకులు గౌని రమేష్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి రేసు రమేష్, గ్రామ యూత్ అధ్యక్షులు పాను గంటి లవన్, అంతటి వెంకటేష్, పోగు ఆదినా రాయణ, జీగట శ్రీనివాస్, అన్నల వెంకన్న, రాసకొండ వెంకన్న, కాండ్ర వెంకటేశ్వర్ రావు, నైనారాపు కేశవులు జగటి నర్సయ్య, జీగాట నాగయ్య, తడికాల సతీష్, బోనగాని కుమార స్వామి, రేసు యాకన్నా పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం:జయశంకర్ భూపాల పల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళే శ్వరం క్షేత్రంలో ఈ నెల 15 నుండి 26 వరకు 12 రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా జరిగే కాళే శ్వరం సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం క్షేత్రంలో గురువారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఐజీ చంద్రశేఖర్ రెడ్డి దేవస్థానం పరిసర ప్రాంతాలు, పార్కింగ్ ప్రాంతాలు, సిసికెమె రాల ఏర్పాటు, భక్తుల క్యూ లైన్లు, పుష్కర ఘాట్ల వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ, సరస్వతి పుష్కరాలకు తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుండి భారీ ఎత్తున భక్తులు హాజరు కానున్నా రని, భక్తులకు ఎలాంటి ఇబ్బందుకు తలెత్త కుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తెలి పారు. అంతకు ముందు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ ప్రధాన రాజ గోపురం వద్ద ఆయనకు ఆలయ అధికారులు,అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి వెంట ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు రామ్ మోహన్ రెడ్డి, సంపత్ రావు, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మహ దేవపూర్ సీఐ రాం చందర్ రావు, కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి, జిల్లా స్థాయి పోలీసు అధి కారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రద్దుచేయాలి

లబ్ధిదారుల ఎంపికను అధికారులకే ఇవ్వాలి

బిఎస్పి జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను రద్దుచేసి, లబ్ధిదా రుల ఎంపికను అధికారులకే ఇవ్వాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్ డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్య కర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పొన్న బిక్షపతి, జిల్లా ఇన్చార్జి వేల్పు గొండ మహేందర్ లు మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రామ కమిటీలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెత్తనం చెలాయిస్తూ ప్రభుత్వ అధికా రులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. నిరు పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, అధి కార పార్టీ నాయకులు అధికారులను ఒత్తిడికి గురిచేస్తు న్నారు. నిరుపేదలను గుర్తించి వారికి ఇండ్లు మంజూరు చేయాలని లేని ఎడల రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇండ్ల మంజూరు సమాచారాన్ని సేక రించి పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లోని ఎంపీడీ వోలను జిల్లా కలెక్టర్ ను బాధ్యులను చేస్తూ గూడు లేని నిరుపేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని, ఇందిరమ్మ ఇండ్ల గ్రామ కమిటీలను రద్దు చేసేంతవరకు వివిధ రూపాలలో పార్టీ కార్యచరణ తీసుకుంటుందని, ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఉపాధ్యక్షులు మేకల ఓంకార్, భూపాల పల్లి నియోజకవర్గ ఇంచార్జి మురారి సదానందం, నియోజకవర్గ అధ్యక్షులు కొయ్యడ దామోదర్, నియోజ కవర్గ ప్రధాన కార్యదర్శి కోడెపాక విజయ, పార్టీ నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడిగా గుర్రపు నాగరాజు గౌడ్

ప్రజాపక్షం/టేకుమట్ల:బిజెపి పార్టీ మండల అధ్యక్షుడిగా మండలం లోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన గుర్రపు నాగరాజు గౌడ్ ను, జిల్లా కౌన్సిల్ మెంబర్ గా నాంసాని రమేష్ ను నియమించినట్లు భూపాలపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు ఏడునూతల నిషిధర్ రెడ్డి వెల్లడిం చారు. నాగరాజు గత 4 సంవత్సరాలుగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పాల్గొనడం, పార్టీ కార్యకర్తలకు అండగా ఉండడం, మండలంలో పార్టీ ఎదుగుద లకు కృషి చేసినందుకు మండల అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా గుర్రపు నాగరాజు మాట్లాడుతూ, మండల అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించినందుకు గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. మండలంలో పార్టీ నాయకులు కార్యకర్తల సహకారంతో రాబోయే రోజుల్లో పార్టీ ఎదుగుదలకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్నకి, చదువు రామ చంద్ర రెడ్డి కి, కన్నం యుగేందర్, నాగపురి రాజమౌళి గౌడ్, రాష్ట్ర నాయకులు కాసర్ల అరవింద్ రెడ్డికి, మాజీ మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ , నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రాంచం దర్ రావుకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## పేసా చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న అధికార యంత్రాంగం



ప్రజాపక్షం/వెంకటాపూర్:ఇసుక క్వారీ లకు అక్రమ గ్రావెల్ తరలిస్తున్నారని ఇది ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని,గొండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్య క్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. మండల పరిధిలోని ఆదివాసుల సమస్యల పట్ల ఆదివాసి గ్రామాల పర్యటనలో భాగంగా ఎదిర గ్రామంలో యువతతో సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా గొండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో 1/70 పేసా చట్టాలని నీరుగారుస్తూ ,ప్రభుత్వ భూములలో ఉన్న మొర్రం ఇసుక ర్యాంపుకు అక్రమంగా భారీ వాహనాల ద్వారా తోలకలు జరుపుతూ, ఏజెన్సీ ప్రాంతంలో హక్కులు చట్టాలను అధికారులు కుని చేస్తున్నారని, వాటిని కాపడవాల్సిన స్థానిక తహశీల్దార్ గారు ఏమా త్రం స్పందించకుండా ఉండటం ఇది ఎంత వరకు సమంజసమని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పేసా చట్టానికి అనుగుణంగానే గ్రావిల్ తవ్వకాలు జరపా లని డిమాండ్ చేశారు. అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల వైపే ఏకపక్షంగా వహిస్తూ ఆదివాసి చట్టాలను నిర్వీర్యం చేసే విధంగా నడుచుకుంటున్నా రని ఆయన మండిపడ్డారు. పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ (పెసా) నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలోని ఇసుక రీచ్‌లను గిరిజన సహకార సంఘాలకే కేటాయించాలని, ఇసుక ర్యాంపులలో బినామీ వ్యవస్థ రద్దుచేసి పూర్తిస్థాయిలో ఆదివాసులకి ఇసుక రీచ్‌ల కేటాయింపు పెసా నిబంధనలకు అనుగు ణంగా జరగాలి అన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ గ్రావెల్ దందా పై జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ గ్రావెల్ నివారణ చర్యలు తీసుకోవా లని అన్నారు. అధికారులు చర్యలు తీసుకొని పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపట్టాక తప్పదని ప్రభుత్వ అధికారులను హెచ్చరించారు. చంటి, కృష్ణ సురేష్, పవన్, ప్రకాష్, అనిల్ తదితరులు ఉన్నారు.

## యువకుని వివాహానికి ఆర్థిక సాయం చేసిన కుంజా సూర్య



ప్రజాపక్షం/మంగపేట:మంగపేట మండలం లోని దోమేడ గ్రామా నికి చెందిన నిరుపేద కుటుంభానికి చెందిన కొమరం భాను ప్రకాష్ తల్లి దండ్రులు అనివార్య కారణాల వల్ల స్వర్గస్తులవ్వగా యువకునికి పెళ్లి నిచ్చయం కాగా అయన పరిస్థితి తెలిసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కుమా రుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ ములుగు నియోజకవర్గ ఆశ కిరణం కుంజా సూర్య పెళ్లి ఖర్చులకు స్థానిక నాయకులచే 20,000 వేల రూపాయలు పంపించగా వాటిని అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమం లో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యాణయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేం దర్, గ్రామ అధ్యక్షులు సప్పిడి వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు, మహ్మద్ ఆశీ, కొమరం కన్నయ్య, మీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల వెడల్పుపై అధికారులు బలవంత సర్వేలు చేయడం సరికాదు

### వేములవాడలో మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత చల్మెడ



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి అనంతరం ప్రధాన రహదారి వెడల్పు చేయాలని వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చెలిమెడ లక్ష్మీ నరసింహారావు ప్రభుత్వానికి సూచించారు. వేములవాడలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లా కలెక్టర్ పోలీస్ లు ఇతర అధికారులు బలవంతంగా సర్వేలు నిర్వహించడం సరికాదన్నారు. ఆలయ అభివృద్ధి అనంతరం రహదారి వెడల్పు లో భాగంగా వ్యాపారులు స్వచ్ఛందంగా రహదారి వెడల్పు సహకరిస్తామని తెలుపుతున్నారని అన్నారు. దేవాలయ అభివృద్ధికి వారు సహకరిస్తామన్నప్పుడు అధికారులు వారి సూచనలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల ద్వారా చిరు వ్యాపారులు, లాడ్జింగ్ కిరాణం వస్త్ర దుకాణం కొబ్బరి కాయలు ఆటో డ్రైవర్లు ఉపాధి పొందుతున్నారని అన్నారు. పట్టణ ప్రజల ఉపాధి దెబ్బతీసే విధంగా చర్యలు తీసుకోవడం మానాలని తాను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు సూచిస్తున్నట్లు తెలిపారు.

## మత్స్యకారుల మహాధర్నాను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/చొప్పదండి:** మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం చొప్పదండిలోని మత్స్యకారుల సంఘ భవనంలో స్థానిక సంఘ నాయకులతో కలిసి ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులమంతా వృత్తి సమస్యలపై ఐక్యంగా పోరాటం చేస్తూ సాదించుకోవాలన్నారు. హైదరాబాదులో జరిగే ధర్నాకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు నూనె శేఖర్, కార్యదర్శి పిట్టల సంపత్, పిట్టల నరసయ్య, పిట్టల ఎల్లయ్య, ఘనవేని రాము, పిట్టల లచ్చయ్య, పిట్టల రాము, కూన సతీష్, పిట్టల నరేష్, పిట్టల రాము, నరసయ్య న్నారు.

## సిరిసేడులో పొన్నం జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** ఇల్లందకుంట మండల కేంద్రంలోని సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగ రామకృష్ణ ఆద్వర్యంలో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ తల్లి గుడి ఆవరణలో కేక్ కట్ చేసారు. మామిడి మొక్క నాటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు దేశిని మహేష్ గౌడ్, రేణుకా ఎల్లమ్మ దేవస్థాన చైర్మన్ నాగపురి సంపత్, కాంగ్రెస్ నాయకులు బినవేని మహిపాల్, పరకాల విజయ్, భోగం మహేందర్, మురహరి రాజు, ఎండి రఫీ, దేవాలయ డైరెక్టర్లు బొమ్మిడి సతీష్, నేరెళ్ల వెంకటరాజ్యం, సంతోష్, ఆంజనేయులు, ప్రెసిడెంట్ తిరుపతి, కొండ వీరన్న, కొండ కుమార్, కొండ చంటి, భూమయ్య, రాజయ్య, మహేందర్, ఉమ్మగోని శ్రీనివాస్, శ్రీపతి రాజు తదితరులున్నారు.

## భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షునికి సన్మానం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా లోని గొల్లపల్లి మండల భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులుగా మండల కేంద్రానికి చెందిన చెవులమద్ది శేఖర్ నియమితులైన సందర్భంగా గురువారం కరీంనగర్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జాతీయ కౌన్సిల్ నెంబర్ పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణా రెడ్డి శాలువాతో సత్కరించిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగతంలో ఎబివిపి నాయకునిగా విద్యార్థి దశ నుంచే విద్యార్థుల సమస్యల పట్ల పోరాటం చేశారని పది సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ దళిత మోర్చా మండల అధ్యక్షులుగా చేశారన్నారు.త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని ఆయన సూచించారు. శేఖర్ మాట్లాడుతూ.తన నియామకం పార్టీ కోసం నిబద్ధతతో అంకిత భావంతో పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఇచ్చిన గౌరవం అన్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేస్తానన్నారు.నా నియామకానికి కృషి చేసిన పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ధర్మపరి నియోజకవర్గ ఇన్ ఛార్జి కన్నం అంజన్న,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొమ్ము రాంబాబు, మాజీ మండల అధ్యక్షులు కట్ట మహేష్, మండల బీజేవైఎం అధ్యక్షులు లక్కకుల వెంకటేష్, పాల్గొన్నారు.

## సిబిల్ స్కోర్ నిబంధనలు రద్దు చేయాలి

### -సిపిఎం(మార్క్సిస్టు) జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్




**ప్రజాపక్షం/వీర్నపల్లి:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో సీబిల్ స్కోర్ అనే నిబంధనను వెంటనే రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఆయన మా ట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి రాష్ట్రంలో 16 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారని, ప్రభుత్వం విధించిన కొత్త నిబంధన సీబిల్ స్కోర్ వల్ల లక్షల మంది యువత ఈ స్కీముకు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఉపాధి అవకాశలు లేకపోవడం వల్లనే యువత ప్రైవేట్ లోన్స్, ఇతర బ్యాంక్‌లలో అప్పు లు తీసుకున్నారని, అలాంటి వారికి సీబిల్ స్కోర్ తక్కువగా ఉంటుందని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఈ విషయంలో పూర్తి స్థాయిలో ఆలోచన చేసి, ఎటువంటి నిబంధనలు పెట్టకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని కోరారు.

## పర్మిషన్ లేని ప్రకృతి రిసార్ట్

**ప్రజాపక్షం/ఇల్లంతకుంట :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ప్రకృతి రిసార్ట్, శేషాద్రి గార్డెన్ లు అక్రమంగా నిర్మాణం అయి ఉన్నాయి. ఈ అక్రమ నిర్మాణాలకు గ్రామపంచాయతీ నుండి ఎటు వంటి అనుమతులు లేవని స్థానిక పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వీటిపై ఇప్పటికే పలు సార్లు నోటీసులు ఇచ్చామని అయినా కూడా వారి నుండి ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణమైన ఈ రిసార్ట్ లో రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలతో పాటు డిజె సౌండ్ లు నిర్వహిస్తున్నట్టు సమాచారం. మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరం, పక్కనే మిడ్ మానేరు డ్యాం, కూత వేటు దూరంలోనే కందికట్కూర్ ఎల్లమ్మ దేవాలయం ఉన్న అధికారులకు కనపడట్లేదా అని మండల ప్రజలు గుసగుసలు పెడుతున్నారు. ఇందులో స్విమ్మింగ్ పూల్ కూడా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించడంతో పాటు, కనీస సెక్యూరిటీ లేకుండా మెయిన్ రోడ్డుకు అనుకొని ఉన్న పట్టించుకున్న పాపాన పోవట్లేదని పొత్తూర్ గ్రామ ప్రజలు అంటున్నారు. గతంలో మండలంలోని ఓ గ్రామంలో అక్రమ నిర్మాణం చేపట్టారని మాజీ సర్పంచ్ కు చెందిన ఇంటిని కూల్చేసిన అధికారులు, మెయిన్ రోడ్డుకు అనుకొని ఉన్న రిసార్ట్ లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న చర్యలు తీసుకోకపోవడంపట్ల ఏదైనా రాజకీయ నాయకుని ఒత్తిడి ఉందా.. లేదంటే అధికారులకు ముడుపులు ముట్టాయేమో అని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఇట్టి అక్రమ నిర్మాణాలపై పూర్తి విచారణ చేసి చట్టరీత్య తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


గ్రామపంచాయితి కార్యాలయము పొత్తూరు
మం॥ ఇల్లంతకుంట జి.రాజన్నసిరిసిల్ల.
Panchayath Secretary
G.P. POTHUR

## భారత వీర మహిళా సోఫియా ఖురేషి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతి-నిధి :** ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్ లోని ఉగ్రవాదుల స్తావరాలపై మెరుపుదాడులు చేపట్టిన కల్నల్ సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ లు భారతదేశం గర్వించదగ్గ వీర మహిళలని జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి ప్రశంషించారు.పహాల్గం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిలో 26మంది ప్రాణాలు కోల్పోగా ఈ దాడికి ప్రతికారంగా భారతసైన్యం ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్ లోని 9 ఉగ్ర స్తావారాలపై మెరుపు దాడులు చేయడాన్ని ప్రతి భారతీయుడు అభినందనలు తెలుపుతున్నారని కిషన్ రెడ్డి గురువారం జగిత్యాలలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆపరేషన్ సింధూర్ లోఆర్మీ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషి చరిత్ర సృష్టించారని కొనియాడారు.కేవలం 25 నిమిషాల్లో ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసి భారత సైన్యం ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాయని ఇందులో కీలక పాత్ర పోషించిన కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ల సాహసాన్ని భారతదేశ ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని కిషన్ రెడ్డి అన్నారు.దేశ భద్రతే కర్తవ్యమని భావించి సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ లు దేశ భక్తిని చాటారని,వీరు దేశానికి శక్తివంతమైన మహిళలని కొనియాడారు.దేశం యుద్ధం ముంగిట ఉంది... ఇలాంటి తరుణంలో భారత పౌరులందరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఎవరి స్వస్థలాలకు వారే సైనికుడిలా ఉందామని కిషన్ రెడ్డి కోరారు.

## ఆపరేషన్ సిందూర్‌ను ఎగతాళి చేసిన ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలి




**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ఆపరేషన్ సిందూర్ పై అవమానించేలా పేస్ బుక్ లో పోస్ట్ చేసిన కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్. సూరేపల్లి సుజాత పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారత్ సురక్ష సమితి నాయకులు జగిత్యాల టౌన్ సిఐ వేణుగోపాల్ కు పిర్యాదు చేశారు.గురువారం భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలోనాయకులు శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత పై దేశ ద్రోహి కేసు నమోదు చేయాలని జగిత్యాల పట్టణ సి ఐ వేణు గోపాల్ ను కోరారు. ఈ సందర్భంగా బి ఎస్ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో శాతవాహన యూనివర్సిటీ ప్రొ. సూరేపల్లి సుజాత ఆమె పేస్ బుక్ లో పెట్టిన ఓ పోస్టు ఇండియన్ ఆర్మీ, దేశ ప్రజల మనోభావాలను కించపరిచే విధంగా ఉందనీ, ఆమె తన సామాజిక మాధ్యమంలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా సిందూరం అంటే రక్త సిందూరం లాంటిదా? నేవేదో భక్తి, పూజ, శుభానికి సంకేతం అనుకునేదాన్ని... యుద్ధాలు శవాలను, శకలాలను మిగులుస్తాయి కానీ శాంతిని కాదు అంటూ ఆమె ఫేస్బుక్లో బుధవారం పోస్టు చేయాడన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఆ పోస్టుపై దేశ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు.మరో వైపు ఆపరేషన్ సిందూర్ను ఎగతాళి చేసిన ప్రొ. సుజాత ముమ్మాటికి దేశ ద్రోహిఅని చెబుతూ ఆపరేషన్ సిందూర్ ను తప్పుబట్టేవిధంగా ఆమె వ్యవహరించిన తీరు దుర్మార్గమని ఆమె రాష్ట్ర విద్యాకమిషన్ సభ్య రాలిగా ఉండి సుజాత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆమె పై దేశ ద్రోహి కేసు నమోదు చేసి వారి పై చట్ట రీత్య చర్యలు తీసుకోవాలని రాజు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏ సీ ఎస్ రాజు, పుప్పాల సత్యనారాయణ, సింగం గంగాధర్,అక్కినపెల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్ , బోందుకురీ శ్రీనివాస్, కొత్తకొండ బాలన్న, రామచంద్రం , గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.